

సాగు.. షురూ!

ఏరువాక ముగిసింది. మృగశిర కార్తె ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸



ముగిసిన వీధి నాటకం

దుద్యాల్ మండలం హకీంపేట్‌లో నిర్వహించిన రామాయణం వీధి నాటకం శనివారంతో ముగిసింది. 9లో▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మున్సిపల్ మాజీ చైర్మన్



సీఎం రేవంత్‌రెడ్డితో జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మార్యద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లి కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. భారీ మొత్తంలో నిధులతో మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

నీట్‌లో సత్తాచాటిన మండల విద్యార్థి

జాతీయ స్థాయిలో 660 ర్యాంక్ సాధించిన హరీష్



యాలాల/తాండూరు టౌన్: నీట్ ఫలితాల్లో మండల విద్యార్థి సత్తా చాటారు. బెన్నూరు గ్రామానికి చెందిన కరణం లక్ష్మీకాంత రావు, విద్యారాణి దంపతుల కుమారుడు కరణం హరీష్ గౌతం గత మేలో నిర్వహించిన నీట్ జాతీయ స్థాయి అర్హత పరీక్షలకు హాజరయ్యాడు. శనివారం వెలువడిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 660వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 416వ ర్యాంకు సాధించారు. నీట్ పరీక్షలో అన్ని సబ్జెక్టుల్లో 99శాతం ఉత్తీర్ణతతో హరీష్ మార్కులు సాధించడం విశేషం. హరీష్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. టీపీయూఎస్ రాష్ట్ర కోశాధికారిగా ఉన్నారు. నీట్‌లో ప్రతిభ చాటిన హరీష్‌కు ఉపాధ్యాయులు, సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

రక్త దానం ప్రాణదానంతో సమానం

తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్ కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తాండూరు టౌన్: రక్తదానం ప్రాణ దానంతో సమానమని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్ కుమార్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో కేక్ కట్ చేసి, రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద సమయంలో, అత్యవసర శస్త్ర చికిత్సల సమయంలో కావాల్సిన రక్త గ్రూపు లేక పోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన రక్తనిధి కేంద్రంలో యువత, పెద్దలు రక్తదానం చేసి రక్త నిల్వలను పెంచాలన్నారు. రక్తదానం చేయడం ఆరోగ్యకరమైన అంశమని, అలాగే ఇతరులు ప్రాణాలను నిలబెట్టిన వార వుతారన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆనంద్ గోపాల్ రెడ్డి, రక్తనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌కు 2,358 బస్తాల మక్కలు



ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 2,358 బస్తాల మొక్కజొన్నలు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. బీట్లలో వ్యాపారులు క్వింటాలు మొక్కజొన్నలకు తక్కువగా రూ.2,140, మధ్యస్థంగా రూ.2,170 ఎక్కువగా రూ.2,290 వరకు ధర పలికిందని తెలిపారు. 1010 రకం ధాన్యం 1,045 బస్తాలు రాగా క్వింటాలుకు రూ.1,870, రూ.1,880, రూ.1,950 వరకు, సోనారకం వడ్లు 291 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,050, రూ.2,100, రూ.2,150 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని ఆమె వివరించారు.

❖ నాన్న నడిపించాడు.. నన్ను గెలిపించాడు



శశికాంత్

షాద్‌నగర్: వేలు పట్టి నడిపించాడు... అక్షర ప్రపంచాన్ని పరిచయం చేశాడు.. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అండగా నిలిచాడు.. తాను ప్రస్తుతం లేకపోయినా నా నీడగా ఉంటూ నన్ను గెలిపించాడు.. అంటూ తన తండ్రి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఐఆర్ఎస్ సాధించిన కొర్రావత్ శశికాంత్. తన తండ్రి ప్రస్తుతం భౌతికంగా లేకున్నా తన హృదయంలో తనకు జీవితాన్ని, భవితవ్యాన్ని ఇచ్చిన వ్యక్తిగా ఎప్పటికీ గుర్తుంటాడని చెబుతున్నాడు ఈ ఐఆర్ఎస్ అధికారి.



నాన్న రాములు నాయక్‌తో శశికాంత్

సొంతూరిని విడిచి..

మాది మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామ పరిధిలోని చాకలిదాని తండా. తల్లిదండ్రులు రాములు నాయక్, సీతమ్మలకు రెండవ సంతానం. తనకు అన్న నీలిమ, తమ్ముడు శ్రీకాంత్ ఉన్నారు. ఉన్నత చదువుల కోసం షాద్‌నగర్‌కు తీసుకొచ్చాడు. హాస్టల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తూ చదివించాడు. తమను భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో చూడాలన్నది ఆకాంక్ష. అందుకు ఆయన ఎంతో శ్రమించారు.

అపుడే నిర్ణయం తీసుకున్నా

నాన్న ప్రతి రోజు నా వెంట పాఠశాలకు వచ్చేవారు. చదువుల్లో రాణించి మంచి మార్కులు సాధించాలని చెప్పేవారు. ఏ చిన్న సందేహం వచ్చినా వెంటనే ఉపాధ్యాయులను అడగాలని సూచించేవారు. ఎంతో గారాబంగా పెంచారు. 8వ తరగతి వరకు షాద్‌నగర్‌లో పూర్తి చేసిన తర్వాత 9,10 వట్టెం నవోదయలో చేర్పించాడు. అప్పుడే నేను సివిల్స్ వైపు దృష్టి సారించాను. నాన్న ఆశయాలను నెరవేర్చాలని నిర్ణయించుకున్నాను. అనంతరం ఇంటర్ హైదరాబాద్ వికాస్‌లో, బీటెక్ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తి చేశా.

గెలుపు చూడకుండానే విడిచి వెళ్లిపోయాడు

తనను ఉన్నత స్థానంలో నిలిపేందుకు నాన్న అన్ని విధాలా ప్రోత్సహించారు. 2008 బీటెక్ చదువుతుండగా ఆయన అకాల మరణం కలిచివేసింది. నాన్న లేరనే విషయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను. అమ్మ ప్రోత్సాహంతో సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వే సర్వీస్‌లో ఉద్యోగం సాధించా. నేను సాధించిన లక్ష్యాన్ని నాన్న చూసి ఉంటే ఎంతో సంతోష పడేవాడు.

నాన్నే.. మా హీరో

ప్రేమ, త్యాగానికి ప్రతిరూపం నాన్న.. తాను కొవ్వొత్తిలా కరుగుతూ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిషలు కష్టపడే శ్రామికుడు నాన్న.. జీవన ప్రయాణంలో తన స్వార్థం కోసం చూసుకోకుండా.. బిడ్డలను ఒడ్డున చేర్చేందుకు పరితపించే నావికుడు నాన్న.. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే తపనతో.. చివరి శ్వాస వరకూ రక్తమాంసాలను కరిగించే యోధుడు నాన్న.. ఎన్ని జన్మలైనా.. ఎంత సేవ చేసినా తీర్చుకోలేని రుణం నాన్న.. అందుకే నాన్నా.. మీరే మా హీరో. ఆదివారం జాతీయ పితృ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనాలు..

❖ ఆయన కష్టమే ఈ జీవితం



దుద్యాల్: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన పిడుగు వెంకటయ్య–మాసనమ్మ దంపతులకు కొద్దిపాటి భూమి ఉంది. దీన్ని సాగు చేసుకుంటూ మరోవైపు వీఆర్‌ఏ ఉద్యోగం చేస్తూ ముగ్గురు కుమారులను బాగా చదివించారు. ప్రస్తుతం వారు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. పెద్ద కొడుకు తిరుపతి వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. రెండో కుమారుడు గోపాల్ విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా బొంరాస్‌పేట్ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. మూడో కొడుకు శ్రీనివాస్ అబ్కారీ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నాన్న కష్టమే ఈ రోజు తాము ఉన్నతమైన జీవనం సాగిస్తున్నామని వారు ఆనందం వ్యక్తం చేశారు.

❖ తండ్రి కష్టాలు చూస్తూ పెరిగాం



యాలాల: ఒక వైపు పేదరికం .. మరోవైపు కుటుంబ భారం .. అయినా బెదరకుండా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు ఆ తండ్రి. నాన్న పడిన కష్టానికి ప్రతిఫలంగా నేడు ఆయన పిల్లలు ఉన్నత స్థాయిలో నిలదొక్కుకున్నారు. యాలాల మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ, భారతి దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు. డిగ్రీ వరకు చదువుకున్న ఆయన ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, పాల బూత్‌ను నిర్వహిస్తూ పిల్లలను చదివించారు. నేడు నలుగురూ ఉన్నత స్థాయిలో నిలిచారు. పెద్ద కొడుకు కేశవ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, శివ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, కమల్ హాసన్ పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా, విజయ్ రతన్ కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి కంటి విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. నాన్న పడ్డ కష్టానికి ప్రతిఫలమే తాము అని నలుగురు కుమారులు పేర్కొన్నారు.



ఏడుగురు కుమారులతో బిచ్చన్న

❖ 'సెవెన్ స్టార్' బిచ్చన్న

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన బిచ్చన్న – విజయలక్ష్మి దంపతులకు ఏడుగురు సంతానం. దర్జీ వృత్తి చేస్తూ పిల్లలను చదివించారు. ఆ కాలంలో ఏడుగురిని చదివించడమంటే ఆషామాషీ కాదు.. కానీ బిచ్చన్న బెదరలేదు.. పేదరికాన్ని జయించి కొడుకులను ఉన్నత స్థానంలో నిలిపారు. మొదటి కుమారుడు సత్యకుమార్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ, ఐఐసీటీ.., సౌత్‌ఆఫ్రికాలో పోస్టు డాక్ చేశారు. ప్రస్తుతం మస్కట్ దేశంలో యూనివర్సిటీ ఆఫ్ నిజ్వాలో అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ రీసర్చ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండో కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఐఐటీ బాంబే, ఎంఎస్సీ గణితం పూర్తి చేసి ప్రస్తుతం మస్కట్ దేశంలో హాలీ బ్యాంకులో పని చేస్తున్నారు. మూడో కుమారుడు రవికుమార్ దౌల్తాబాద్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. నాల్గో కుమారుడు అనిల్‌కుమార్ మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రస్తుతం కెనడియన్ కంపెనీలో రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వాటర్ టెక్నాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఐదో కుమారుడు శివకుమార్ ఎంబీఏ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఓ ప్రముఖ నగల దుకాణంలో సీనియర్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. ఆరో కుమారుడు మనోజ్‌కుమార్ ఐఐఐటీ పూర్తి చేసి ఫీడెక్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా రాణిస్తున్నారు. ఏడో కుమారుడు నవీన్‌కుమార్ పాండిచ్చేరి యూనివర్సిటీలో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసి అపెక్స్ కోవంటిజ్ ఎల్ఎల్‌సా, యూఎస్ కంపెనీలో డాటా ప్రోగ్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లలందరూ ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో బిచ్చన్న సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

❖ తల్లిలేని లోటు తీర్చాడు..



ఎస్‌ఐ రమేష్



తండ్రితో..

కుల్కచర్ల: అదో మారుమూల గ్రామం.. అందులో ఒక నిరుపేద రైతు కుటుంబం. చిన్నతనంలోనే తల్లిని కోల్పోవడంతో నాన్నే సర్వంగా మారి తనను ఉన్నత స్థానంలో నిలిపాడు.. ఆయనే నాకు స్ఫూర్తి అని కుల్కచర్ల ఎస్‌ఐ రమేష్ పేర్కొన్నారు. కొందుర్గు మండలం కాస్లాబాద్‌కు చెందిన వన్నెగూడ సత్యయ్యకు ఒక కుమారుడు. భార్య చాలా ఏళ్ల క్రితమే చనిపోయింది.. కొడుకు రమేష్‌ను బాగా చదివించి ఉన్నత స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. అందుకోసం ఎంతో శ్రమించారు. తండ్రి శ్రమను గుర్తించిన రమేష్ అంతే పట్టుదలతో చదివి ఎస్‌ఐ ఉద్యోగం సాధించారు. తన ఎదుగుదలకు నాన్నే కారణమని, ఆయన స్ఫూర్తితోనే ఈ స్థాయికి చేరుకోగలిగానని గర్వంగా చెప్పారు. రమేష్ ప్రస్తుతం కుల్కచర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. నాన్న చూపిన మార్గంలోనే ముందుకు సాగుతానని పేర్కొన్నారు.



జిల్లాలో చెంచుల స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

జన్‌మన్ జాడేదీ..!

- పథకం అమలులో నిర్లక్ష్యపు నీడ
- చెంచుల అభ్యున్నతికి కేంద్రం తెచ్చిన ప్రత్యేక స్కీం
- ప్రారంభించి ఏడాది గడిచినా సాగని పనులు
- జిల్లాలో 22 ఆవాసాల్లో చెంచుల నివాసం
- 740 కుటుంబాలు, 2,554 మంది జనాభా

వికారాబాద్: చెంచుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జన్‌మన్ కార్యక్రమం ముందుకు సాగడంలేదు. ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసి న్యాయ అభియాన్ (పీఎం జన్‌మన్) పేరుతో కేంద్రం గతేడాది క్రితం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. చెంచు గూడేలు, వారి జీవితాల్లో సమూల మార్పులు తేవడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తున్నారు. స్కీం ప్రారంభించే ముందు వారి స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వే నిర్వహించారు. జిల్లాలో 22 ఆవాసాల్లో చెంచులు నివసిస్తుండగా 740 కుటుంబాలు, 2,554 మంది ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 42 అంశాలపై సర్వే నిర్వహించి వివరాలు సేకరించింది. ఈ ప్రక్రియ పూర్తయ్యి ఏడాది దాటినా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. కార్యక్రమం కాస్త సర్వేకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పథకంలో పొందుపర్చిన అంశాలు

పీఎం జన్‌మన్ పథకంలో చెంచుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక అంశాలను పొందుపర్చారు. ముందుగా వారి వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు 42 అంశాలతో కూడా సమాచారం సేకరించారు. ప్రధానంగా వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన సదుపాయాల్లో ఇప్పటి వరకు ఏవేవి కలిగి ఉన్నారు..? ఇంకా ఏవేవి కల్పించాల్సి ఉంది..? అనే అంశాలను ఈ సర్వే ద్వారా తెలుసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. చెంచు కుటుంబాలకు పక్కా ఇళ్లు ఉన్నాయా..? ఇంటికి కులాయి ఉందా లేదా..? లాంటివి తెలుసుకున్నారు. ప్రతి చెంచు ఆవాసానికి రహదారి, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, అందరికి నాణ్యమైన విద్య లాంటివి ఈ పథకం ద్వారా అందించాలని నిర్ణయించారు. వృత్తి విద్యా నైపుణ్యం, అందరికీ ఆరోగ్యం, పోషణ, మెరుగైన టెలిఫోన్ సౌకర్యం తదితర కార్యక్రమాల ద్వారా జీవనోపాధి మెరుగు పర్చడం లాంటివి ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. ఉచిత నిత్యావసరాలు, ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్, గర్భిణులకు ఆర్థిక సాయం, సుకన్య సంవృద్ధి యోజన, వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తదితర పథకాలన్నీ అందుతున్నాయా లేదా..? తెలుసుకుని వాటన్నింటిని అందేలా చూడటం ఈ పథకం ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకాన్ని తెలంగాణతోపాటు 28 రాష్ట్రాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.24 వేల కోట్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే స్కీం ప్రారంభించి ఏడాది గడిచినా ఇంకా కార్యక్రమాలేవి చేపట్టకపోవటం విమర్శలకు తావిస్తోంది.

వైఫల్యాలు పునరావృతం కాకుంటేనే..

చెంచుల అభ్యున్నతి కోసం తపపెట్టిన ఈ పథకంలో గత అనుభవాలు, వైఫల్యాలు పునరావృతం కాకుండా చూసుకోగలిగితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గతంలోనూ ప్రభుత్వాలు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక పథకాలు, కార్యక్రమాలు తీసుకువచ్చినా ఆ కుటుంబాలల్లో ఆశించిన మార్పు రాలేదు. వారు అన్ని రంగాల్లో రాణించాలంటే మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా వారిలో సామర్థ్యాల పెంపుదలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలని పలువురు అభిప్రాయపడ్డారు.. లేకుంటే ఇలాంటి ఎన్ని పథకాలు వచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండన్నారు.

సైనిక్ భవన్ మంజూరు చేయండి

సీఎం రేవంత్‌ను కోరిన మాజీ సైనికులు

దుద్యాల్: కొడంగల్ పట్టణానికి సైనిక సంక్షేమ భవనం మంజూరు చేయాలని నియోజకవర్గానికి చెందిన మాజీ సైనికులు కోరారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలో మాజీలు, ప్రస్తుతం సర్వీసులో ఉన్న సైనికులు దాదాపు రెండు వేల మంది ఉన్నారని తెలిపారు. సంక్షేమ భవన్ లేక ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. అలాగే ఆర్మీ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొల్ల రాములు, ఉపాధ్యక్షుడు బోయిని వెంకటయ్య, నాయకులు ఇంతీయాజ్ అలీ, కాంగ్రెస్ కొడంగల్ మండల అధ్యక్షుడు నాందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న మాజీ సైనికులు

బీజేపీలోకి స్వప్న?

- కొద్ది రోజులుగా కాంగ్రెస్‌కు దూరందూరం
- పార్టీలో ప్రాధాన్యత లేదని సన్నిహితుల వద్ద ఆవేదన
- కాషాయ కండువా కప్పుకొనేందుకు ఏర్పాట్లు



తాండూరు: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ కాంగ్రెస్‌ను వీడి కాషాయదళంలో చేరనున్నారా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. అధికార పార్టీలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని అసంతృప్తిగా ఉన్న ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇది తాండూరులో హాట్‌టాపిక్‌గా మారింది. పలువురు మాజీ కౌన్సిలర్లు సైతం స్వప్న బాటలో నడవనున్నట్లు సమాచారం.

మహేందర్‌రెడ్డి వర్గం నుంచి..

2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పట్నం మహేందర్‌రెడ్డి వర్గం నుంచి చైర్‌పర్సన్ అభ్యర్థిగా స్వప్న రేసులోకి వచ్చారు. మరో వైపు ఇదే పార్టీ నుంచి రోహిత్‌రెడ్డి వర్గం తరఫున పట్లోళ్ల దీపనర్సింహులు చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీచేశారు. 36 వార్డులున్న తాండూరులో మహేందర్‌రెడ్డి వర్గీయులు ఎక్కువమంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. దీంతో చైర్‌పర్సన్ కుర్చీ కోసం పోటీ నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు నాయకులు కలిపించుకుని, చైర్‌పర్సన్ పదవీకాలాన్ని ఇద్దరూ చెరిసగం పంచుకోవాలని సూచించారు. మొదటిసారి స్వప్నకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో దీపకు వైస్ చైర్‌పర్సన్ కుర్చీ ఇచ్చి బుజ్జగించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, కోర్టు కేసుల నేపథ్యంలో పదవీ కాలమంతా స్వప్ననే కొనసాగారు. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించిన ప్రతీసారి గొడవలే జరిగాయి.

రాష్ట్ర కమిటీ ఎన్నిక తర్వాతే..

గత అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత స్వప్న కాంగ్రెస్‌లో చేరారు. అయితే పదవీ కాలం ముగిసిన తర్వాత ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి ఆమెకు ఆహ్వానం ఆగిపోయింది. ఈ విషయమై తన సన్నిహితుల వద్ద పలుమార్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈక్రమంలోనే బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల పలు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర కమిటీ నియామకం తర్వాతే కాషాయ తీర్థం పుచ్చుకుంటారని తెలుస్తోంది.

కేసుల పరిష్కారానికి రాజీయే మార్గం

సీనియర్ సివిల్ కోర్టు జడ్జిలు దశరథరామయ్య, శ్యాంకుమార్

ట్రాఫిక్ పోలీస్ కేసులు		
డ్రంకెన్ డ్రైవ్	544	రూ.10,76,500
లైసెన్స్, రిజిస్ట్రేషన్	222	రూ.2,96,500



చేవెళ్ల కోర్టు ఆవరణలో కొనసాగుతున్న మెగా లోక్ అదాలత్

చేవెళ్ల: రాజీమార్గం ద్వారా కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జిలు దశరథరామయ్య, జె.శ్యాంకుమార్, రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షణికావేశంలో గొడవలు, ఘర్షణల కారణంగా సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. భార్యాభర్తల కేసులు, కుటుంబ తగాదాలు, భూ సంబంధిత విషయాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని చెప్పారు.

1,271 కేసులకు రూ.16.62లక్షల జరిమానాలు

చేవెళ్ల కోర్టు ఆవరణలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌లలో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించామన్నారు. ఆరు రోజుల్లో 1,271 కేసులు పరిష్కరించగా రూ.16,62,690 జరిమానా విధించామన్నారు. ట్రాఫిక్ విభాగానికి సంబంధించి 766 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. సివిల్, క్రిమినల్, పిట్టి కేసులకు సంబంధించి పరిష్కరించుకునేందుకు వీలున్న అన్ని కేసులకు పరిష్కారం చూపామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సూపరింటెండెంట్‌లు ఈ.మహిపాల్, బి.కృష్ణవేణి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.కుమార్. సీఐ భూపాల్‌శ్రీధర్, ట్రాఫిక్ ఏఎస్ఐ చందర్‌నాయక్, అడ్వకేట్స్ బి.కృష్ణగౌడ్, బి.మల్లేశ్‌గౌడ్, నర్సింలు, ఉపేందర్, శేఖర్, సిబ్బంది అనిల్‌కుమార్, నర్సింలు, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

152 కేసులకు పరిష్కారం



ఆమనగల్లు: మాట్లాడుతున్న జడ్జి స్వరూప

ఆమనగల్లు: పట్టణంలోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 152 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ స్వరూప కాటం మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీపడి పరిష్కరించుకుంటే ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, సీఐ జానకీరాం రెడ్డి, గంగాధార్, వేణుగోపాల్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు తాండూరుకు అజారుద్దీన్

తాండూరు: భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ ఆదివారం తాండూరుకు రానున్నారు. పట్టణానికి చెందిన వ్యాపారి ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో విలియంమూన్ మైదానంలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ ఫైనల్ దశకు చేరుకుంది. ఈ సందర్భంగా శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

108లో గర్భిణి ప్రసవం



వాణిశ్రీతో తల్లిదండ్రులు, సిబ్బంది

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని చిట్లపల్లితండాకు చెందిన వాణిశ్రీ శుక్రవారం రాత్రి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గ్రామంలో ఉన్న ఆమెకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. ఆమెను వాహనంలో కొడంగల్ నుంచి తాండూరుకు తరలిస్తుండగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో తాండూరు ఆస్పత్రిలో జాయిన్ చేశామని వాణిశ్రీ బంధువులు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో రైతుకు గాయాలు



వీధి కుక్కల దాడిలో గాయపడిన కిష్టప్ప

దోమ: వీధి కుక్కల దాడిలో ఓ రైతుకు గాయాలయ్యాయి. ఈ ఘటన దోమ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన బోయిని కిష్టప్ప ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా అతనిపై దాడి చేశాయి. దీంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయని పేర్కొన్నారు. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువ ఉందని వాటిని జనవాసాలనుంచి తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డుపై జారిపడి చిన్నారి మృతి

దిర్సంపల్లిలో ఘటన



వేణుమాధవ్

దోమ: ఇంట్లో నుంచి వెళ్తున్న బాలుడు ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. ఈ ఘటన దోమ మండల పరిధి లోని దిర్సంపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగీత, రమేశ్‌కు వేణుమాధవ్(4), అనూష(2) సంతానం. ఉదయం 10 గంటల సమయంలో ఆడుకునేందుకు బయటకు వస్తుండగా వాకిట్లోని సీసీ రోడ్డుపై కుప్పకూలి ప్రాణం కోల్పోయాడు. ఇది గమనించిన పక్కింటి మహిళ పరుగున వెళ్లి సంగీతకు చెప్పింది. తల్లి వచ్చి బాలుడిని కదపగా ఉలుకు, పలుకు లేకపోవడంతో లబోదిబోమని రోదించింది. చుట్టు పక్కల వారు అక్కడి చేరుకుని పరిశీలించేసరికే చిన్నారి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మరణంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రుత్విక్ జ్యోషికి 557 ర్యాంకు



రుత్విక్ జ్యోషి (557)ర్యాంకు

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన రాము జ్యోషి కుమారుడు రుత్విక్ జ్యోషి నీట్‌లో ఆలిండియా లెవల్‌లో 557 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు రుత్విక్‌ను అభినందించారు.

సాగు.. పిరం!

పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలు

- ఇదే దారిలో కూలీ రేట్లు
- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- ఎరువులు విత్తనాలకు డిమాండ్
- రైతు భరోసా కోసం ఎదురు చూపు



కంది విత్తనాలు వేస్తున్న యంత్రం

కొడంగల్: ఏరువాక ముగిసింది. మృగశిర కార్తె ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. అడపాదడపా వర్షాలు సైతం కురుస్తున్నాయి. దీంతో రైతులు విత్తనాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎరువులు, విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ధరల పెరుగుదలపై నియంత్రణ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగాయి. వ్యవసాయం పండుగలా మారిన రాష్ట్రంలో రైతన్నలకు సాగు ఖర్చులు పెరిగి పోయాయి. పెట్టుబడి పెట్టలేక ఎరువులు కొనలేక అవస్థల పాలవుతున్నారు. విత్తనాలు వేసే క్రమంలో రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. పెట్టుబడి సాయం వస్తే బాగుంటుందని ఆశ పడుతున్నారు.

ఖర్చులు పెరిగాయి..

రైతు భరోసా పథకం కింద ఎకరాకు గత ప్రభుత్వం రూ.5 వేలు ఇచ్చేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.6 వేలు ఇస్తోంది. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సుమారు 40 వేల హెక్టార్లలో రైతులు పలు రకాల పంటలను సాగు చేసే అవకాశం ఉంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు వాటి నాణ్యతా ప్రమాణాలను బట్టి ఒక్కో ధర ఉంది.

విత్తనాల ధరలు ఎక్కువే

బహిరంగ మార్కెట్‌లో విత్తనాల ధరలు అధికంగానే ఉన్నాయి. కిలో కంది విత్తనాల బ్యాగు రూ.250 ఉంది. జొన్నలు 3 కిలోల బస్తా రూ.550, వరి బస్తా రూ.900, పెసర విత్తనాల బస్తా రూ.800 పత్తి విత్తనాలు 475 గ్రాములకు రూ.850 పలుకుతోంది.

యంత్రాలతో విత్తనం..

నియోజకవర్గంలోని రైతులు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలో ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గతంలో ఉన్న కూలీ రేట్లకు ఇప్పటి రేట్లకు చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. సాగు ఖర్చులు పెరిగి పంట దిగుబడి రాకపోతే నష్టపోతున్నామని రైతులు భావిస్తున్నారు. ఆధునిక సేద్యం చేస్తూ ఖర్చులు తగ్గించుకుంటున్నారు. సాగు ఖర్చులను తగ్గించుకొని యంత్రాల వినియోగంతో పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. మహారాష్ట్రలోని పూణే నుంచి సాగు యంత్రాలను కొనుగోలు చేసి తెస్తున్నారు. వీటితో కంది, పెసర, మినుము, కుసుమలు, జొన్న విత్తనాలు వేస్తున్నారు. రోజుకు 8 ఎకరాల విస్తీర్ణంలో విత్తనాలు వేయవచ్చని రైతులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో పంటలు పండించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహా మేరకు ఈ యంత్రాలను కొనుగోలు చేసినట్లు రైతులు చెప్పారు.

ఎరువు	ధర
డీఏపీ	రూ.1,350
కాంప్లెక్స్	రూ. 1,370
గ్రోమోర్	రూ.1,700
10.26.26	రూ.1,470
ఎమ్‌ఓపీ	రూ.1,535
యూరియా	రూ.266

ఖర్చులు పెరిగాయి



గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు ఖర్చులు పెరిగాయి. కూలీల ధరలతో పాటు ఎరువులు విత్తనాల ధరలు అధికంగా ఉన్నాయి. ఎరువులు కొనడానికి రైతులకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం సాగు ఖర్చుల కోసం రైతు భరోసా ఇస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతు భరోసా డబ్బులు వస్తే మేలు జరుగుతుంది.

– చుక్కప్ప, కొడంగల్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

అనంతగిరి: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అధ్యక్షతన శనివారం వికారాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారికి వెంటనే పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ ఇవ్వకుండా కేవలం డీఏలు ప్రకటించడం సరికాదన్నారు. అనంతరం వెంకటరత్నం మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రైవేటు పాఠశాలలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వమే తన ఆధీనంలోకి తీసుకుని జాతీయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాములు ఉపాధ్యక్షులు నర్సింలు, జమున, కోశాధికారి మోహిస్ ఖాన్, జిల్లా కార్యదర్శులు బాబురావు, పవన్ కుమార్, కృష్ణవేణి, సలీం, ముత్యప్ప, శివరాజ్‌తో పాటు ఆయా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



దామస్తాపూర్ గ్రామస్తులతో ఎంపీ కొండవిశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి

- ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతతోనే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరికలు
- ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

మర్పల్లి: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని చెవేళ్ల పార్లమెంట్ నియోజక వర్గం సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దామస్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. దీంతో ఆయన శనివారం నగరంలోని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయని అసమర్థ ముఖ్యమంత్రి అని ఆయన అవహేళన చేశారు. నిరుద్యోగ యువతకు యువ వికాస్ పథకంలో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆరోపించాడు. రైతులకు ఇంతవరకు రైతు భరోస ఇవ్వలేదన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పుతామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన వారిలో గోవర్ధన్ రెడ్డి, విశాల్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు శాంతుకుమార్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మర్పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రమీల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారు గెస్ట్ లెక్చరర్ పద్ధతిన పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 18న ఆదర్శ పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సత్తాచాటిన కీర్తన



గుడ్ల కీర్తన

బడంగ్‌పేట్: బడంగ్‌పేటకు చెందిన గుడ్ల రాధ, శ్రీనివాస్ దంపతుల కూతురు కీర్తన నీట్ ఫలితాల్లో 468 ర్యాంకుతో సత్తాచాటింది. ఉస్మానియా, లేదా గాంధీ మెడికల్ కాలేజీలో తనకు ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, స్థానికులు ఆమెను అభినందించారు.

గంజాయి విక్రేత అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదర్‌నగర్‌లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద బ్యాగులో ఉన్న 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోరబండ ప్రాంతంలో నివాసం ఉండే బచ్చల లోకేష్ (22) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా ఉన్న కొందరు యువకులతో కలిసి గంజాయి తాగడం అలవాటు చేసుకున్నాడు. మహారాష్ట్రలోని పర్బనీ ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి నగరంలో ఎక్కువ ధరకు విక్రయించడం ద్వారా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌నగర్ వద్ద నల్లటి బ్యాగులో అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం బయట పడింది.

భర్తను హత్య చేసిన భార్య

ఇనుపరాడ్‌తో కొట్టడంతో తీవ్రగాయాలతో మృతి

సైదాబాద్: భర్తకు మద్యం తాగించి.. మత్తులో ఉన్న అతడిపై భార్య ఇనుపరాడ్‌తో దాడి చేయటంతో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన గురించి వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జీషాన్ అలీ (45) నగరానికి వలస వచ్చి 18 ఏళ్ల క్రితం చంద్రా అలియాస్ అయేషా పర్వీన్‌ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. చాలా కాలం ఎల్‌బీనగర్‌లో నివసించిన వీరు తమ ఐదుగురు సంతానంతో ఇటీవల సింగరేణి కాలనీలో అద్దెకు దిగి పూల వ్యాపారం చేసేవారు. జీషాన్ అలీ తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. యూపీలోని శరన్‌పూర్‌లో నివసించే అతని సోదరుడు షకీర్ అలీ వారిని ఫోన్‌లో సముదాయించే వాడు. అయితే అయేషా ఇటీవల మరొకరితో చనువుగా ఉంటుందని జీషాన్ అలీ భార్యతో గొడవపడటం ఎక్కువైంది. ఈ నెల 11న అయేషా తన భర్తను ఇనుప రాడ్‌తో విచక్షణారహితంగా కొడుతుండగా వారి ఇంటి నుంచి వచ్చిన శబ్దాలు విని స్థానికులు వెళ్లి ఆమెను అడ్డుకొని జీషాన్‌ను పడుకోబెట్టి వెళ్లి పోయారు. మరుసటి రోజు అయేషా తన భర్తను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా వారు పరీక్షించి అతని పరిస్థితి విషమంగా ఉందని ఉస్మానియాకు తీసుకెళ్లమన్నారు. అక్కడికి వెళ్లగా..అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు షకీర్ అలీ శుక్రవారం యూపీ నుంచి నగరానికి వచ్చి ఓజీహెచ్‌లో తన అన్న మృతదేహాన్ని గుర్తించాడు. తన సోదరుడిని కొట్టి చంపిన అయేషాపై సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

వేర్వేరు ఘటనలో ఐదుగురు అరెస్టు

ఫిలింనగర్: మద్యం మత్తులో కారు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారకులైన ఐదుగురిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట ఓయూ కాలనీలో నివసించే వడ్ల వెంకటేష్‌తో పాటు ఆయన స్నేహితులు శ్రీను, కిరణ్, అనిల్ నలుగురూ కలిసి అర్ధరాత్రి మల్కం చెరువు వద్ద మద్యం తాగారు. అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో మద్యం మత్తులోనే కారు నడుపుకుంటూ ఓయూ కాలనీ వైపు వెళ్తుండగా ఇంటి ముందు పార్కింగ్ చేసిన అజాహరుద్దీన్ అనే వ్యక్తికి చెందిన కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో అజహరుద్దీన్ కారు దెబ్బతిన్నది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారికి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా అందరూ మద్యం తాగినట్లుగా తేలింది. వీరందరినీ అరెస్టు చేశారు.

మరో ఘటనలో...

ఫిలింనగర్‌లోని అపోలో ఆస్పత్రి సమీపంలో బొటిక్ నడిపిస్తున్న హరీష్ శుక్రవారం అర్ధరాత్రి 11.30 గంటలకు బొటిక్‌లోనే మద్యం తాగి..మత్తులో కారు నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఎఫ్ఎన్‌సీసీ సమీపంలో మహనీయుల చౌరస్తా వద్ద కారు అదుపుతప్పి రఘుపతి వెంకయ్యనాయుడు విగ్రహం దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో దిమ్మె ధ్వంసమైంది. డివైడర్ కూడా దెబ్బతినగా కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న హరీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హరీష్‌కు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగినట్లుగా నిర్ధారణ అయ్యింది. శనివారం ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజీయే రాజమార్గం

పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప



లోక్ అదాలత్‌లో జడ్జి శిల్ప

పరిగి: రాజీయే రాజమార్గమని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప అన్నారు. శనివారం వివిధ కేసులపై మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఇరువురి రాజీ ద్వారా పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి శిల్ప మాట్లాడుతూ పంతాలకు పోయి గొడవలు పెంచుకోవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులు పలు కేసులకు దారితీస్తాయన్నారు. కావున ఎలాంటి కేసులైన లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఇక్కడ పరిష్కారమైన కేసులను అంతిమ పరిష్కారంగా పరిగణిస్తారన్నారు. కావున కేసులు ఉన్న వారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ బాలముకుందర్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఇబ్రాహింఖాన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే పీడీ యాక్ట్

అటవీశాఖ రేంజర్ అధికారి రాజేందర్

యాలాల: అటవీ భూములను ఆక్రమిస్తే బాధ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని అటవీశాఖ రేంజర్ అధికారి రాజేందర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని బాణాపూర్‌లో అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ..ఇటీవల అటవీ ప్రాంతంలోకి కొందరూ ఉద్దేశపూర్వకంగా చెట్లను నరికి భూములను నాశనం చేసేందుకు యత్నిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. అటవీ ప్రాంతంలోకి రాత్రివేళ జేసీబీలు, ట్రాక్టర్లు, డోజర్లు తీసుకెళ్లి భూచదును చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ కనకరాజు, బీట్ ఆఫీసర్ కాశన్న తదితరులు పాల్గొన్నారు.



బాణాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

మామిడి పండ్ల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ



రోడ్డుపై ట్రాఫిక్ జామ్

డ్రైవర్‌కు గాయాలు

- నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



గాయపడిన డ్రైవర్

కొత్తూరు: మామిడి పండ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ చేగూరు కూడలి జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా నుంచి మామిడిపండ్ల లోడ్‌తో ఢిల్లీ వెళ్తున్న లారీ చేగూరు కూడలి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం కారణంగా తిమ్మాపూర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్లే రోడ్డులో నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. లారీ బోల్తా పడగానే పలువురు వాహనదారులు, ప్రజలు మామిడి పండ్లను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో లారీను తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నర్సింహ్మారావు తెలిపారు.

పెంజర్ల కూడలిలో..

షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీ పెంజర్ల కూడలి సమీపంలో అదుపు తప్పి, బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నర్సింహ్మారావు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం





అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయిస్తున్న తహసీల్దార్ అన్వర్

- షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్
- హైతాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

షాబాద్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ హెచ్చరించారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామ శివారు సర్వే నంబర్ 8లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం ఆయన కూల్చివేయించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యాపారాలకు అనుగుణంగా కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 111 జీవోలో కూడా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయమై ఎంపీడీఓ, ఎంపీఓకు సమాచారం అందించామని స్పష్టంచేశారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఐదో అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణం

సనత్‌నగర్: ఎర్రగడ్డ జనప్రియా అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి ఓ మహిళ దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏలూరు జిల్లా అడ్డగిద్దల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రాజు, కొక్కిణి శ్రావణి (30) దంపతులు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు నడుస్తుండడంతో మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో గత ఆరు నెలల క్రితం శ్రావణిని ఎర్రగడ్డ జనప్రియా అపార్ట్‌మెంట్స్‌లో ఉండే తల్లిదండ్రులు శ్రీనివాస్, దుర్గాలు తమ వద్దకు తీసుకువచ్చారు. గత ఆరు నెలలుగా తల్లిదండ్రులతో కలిసి ఉంటూ స్థానికంగా హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. మూడు రోజుల క్రితం వీరు ఊరిలో ఉన్న అల్లుడు రాజు వద్దకు వెళ్లి తమ కూతురు కాపురం నిలబెట్టాలనే ఉద్దేశంతో ఒప్పించి అతనిని కూడా ఇక్కడికి తీసుకువచ్చారు. అయితే భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపం చెందిన శ్రావణి శనివారం ఉదయం 8.30 గంటలకు జనప్రియా అపార్ట్‌మెంట్స్ ఐదో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శ్రావణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల వల్లనే శ్రావణి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేస్త్రి ఆత్మహత్య

రాజేంద్రనగర్: తాను పనిచేస్తున్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఓ మేస్త్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ భానుమతి తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన సాహు (28) తన భార్యతో కలిసి బతుకు తెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. హైదర్‌గూడ జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో మేస్త్రి పనిచేస్తూ జీవిస్తున్నాడు. అపార్ట్‌మెంట్ వద్దనే ఉంటూ భార్యాభర్తలిద్దరూ పని చేసేవారు. శనివారం మధ్యాహ్నం సాహు 8వ అంతస్తు పైకి వెళ్లి తోటి కార్మికులు చూస్తుండగానే పై నుంచి కిందికి దూకాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన సాహు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సాహు ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.